క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు కృషి


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

ఖమ్మంరూరల్: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ మూడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తెల్దారుపల్లి జరిగిన ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ నాణ్యతతో కూడిన విద్యాబోధన చేయాలని, మధ్యాహ్న భోజనంలో ప్రతీ రోజూ మెనూ పాటించేలా చూడాలని ఈవిషయంలో ఎలాంటి తేడా వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఎంఈఓ ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ వార్డు కమిటీల ఎన్నిక

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ వార్డుల కమిటీ ఎన్నిక మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.హరినాథ్‌బాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కమిటీల 5, 26, 27వ వార్డుల కమిటీ అధ్యక్షులుగా బాణోత్ ప్రసాద్‌నాయక్, సునీల్ నాయక్, భూక్యా పూల్‌చంద్‌నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాణోత్ కిషోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు ప్రత్యేక కౌన్సెలింగ్

నేలకొండపల్లి: కళాశాలలో డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్టు నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి తెలిపారు. ఈ మేరకు శనివారం కాలేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 31 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవకాశం ఉందని, కళాశాలలో చేరేందుకు ఇదే చివరి అవకాశమన్నారు. పూర్తి వివరాలకు 9885079090, 9550272092 నంబర్లను సంప్రందించాలని కోరారు. ఈ సమావేశంలో దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి


మాట్లాడుతున్న చినవెంకటరెడ్డి

ఖమ్మంరూరల్: రైతులకు యూరియాను సరిపడా అందుబాటులో ఉంచాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చినవెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు ఊపందుకున్నాయని, అందుకు తగ్గట్టుగా ఎరువులు కూడా రైతులకు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెన్నం భాస్కర్, ఎం.శంకర్‌రెడ్డి, ఏలూరి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హరిహర వీరమల్లు
వినోద	హరిహర వీరమల్లు, ద ఫన్‌టాస్టిక్ ఫోర్
సాయిరాం	జూనియర్
ఆదిత్య	హరిహర వీరమల్లు, జూనియర్
శ్రీనివాస	హరిహర వీరమల్లు, సయార(హిందీ)

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	42	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	70		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	160		20
బీర	36	తోటకూర	4
దొండ	20		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		30
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	86	-ఖమ్మం వ్యవసాయం	

ప్రభుత్వ కళాశాల.. కళకళ

- కూసుమంచి కళాశాలలో పెరుగుతున్న అడ్మిషన్లు
- నూతన భవన నిర్మాణానికి రూ.5.50 కోట్లు
- భవనం పూర్తయితే తీరనున్న వెతలు


కూసుమంచిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

సండే స్పెషల్

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచిలో ప్రభుత్వ ఇంటర్ కళాశాల ఏర్పాటుకు ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తులు చేస్తుండగా ఈ కల గతేడాది నెరవేరింది. పాలేరు నుంచి ప్రాతనిధ్యం వహిస్తూ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో గతేడాది కూసుమంచిలో ఇంటర్ కళాశాల ఏర్పాటుకు అనుమతి లభించింది. దీంతో కూసుమంచి గురువాయిగూడెం రోడ్డులో ఉన్న రెవెన్యూ అకాడమి భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయగా గత సెప్టెంబర్‌లో తరగతులు ప్రారంభమయ్యాయి. ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. గత విద్యాసంవత్సరం మొదటి సంవత్సర విద్యార్థులకు ఆలస్యంగా తరగతులు మొదలైనా ఉత్తమ ఫలితాలు రావడంతో ఈసారి చేరేందుకు విద్యార్థులు క్యూ కట్టారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య..

కూసుమంచిలో ప్రైవేట్ కళాశాలలు మూడు ఉండగా అందులో రెండు మూతబడ్డాయి. ప్రస్తుతం ఒక్కటే కొనసాగుతుంది. దీంతో విద్యార్థులకు ప్రభుత్వం పరంగా ఇంటర్ విద్య అవకాశాలు లేకపోవడంతో కళాశాల ఏర్పాటుకు డిమాండ్ ఏర్పడింది. ఈ తరుణంలో కళాశాల మంజూరు కావడంతో విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 53 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా ఈ విద్యాసంవత్సరం ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి అడ్మిషన్లు 158కి చేరడం విశేషం.

భవనాలకు రూ.5.50 కోట్లు..


తరగతి గదిలో విద్యార్థులు

కళాశాలను మంజూరు చేయించటమే కాక పక్కా భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి రూ.5.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో కూసుమంచిలోని పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణ పనులు ప్రారంభించారు. విశాలమైన తరగతి గదులు, స్టాఫ్ రూమ్స్, ల్యాబ్, లైబ్రరీ లాంటి వసతులు కల్పించనున్నారు. దీంతో నాణ్యమైన విద్యతో పాటు చక్కని వసతి లభించనుంది.

బస్సులు లేక వెనుకడుగు..

ఈ కళాశాలలో మరింత మంది చేరడానికి ఆసక్తిగా ఉన్నా రవాణా సౌకర్యం ఆటంకంగా మారుతుంది. మండలంలోని పోచారం, నేలపట్ల, గోరీలపాడు, జక్కేపల్లి, నేలకొండపల్లి-కూసుమంచి రూట్‌లో గతంలో ఉన్న బస్సులను పునరుద్ధరిస్తే విద్యార్థుల ఇబ్బందులు తొలగుతాయి. ప్రస్తుతం వస్తున్న విద్యార్థులకు కూడా బస్సులు లేక సకాలంలో చేరుకోలేకపోతున్నారు. దీనిపై మంత్రి పొంగులేటి దృష్టి సారించి బస్సులు పునరుద్ధరిస్తే అడ్మిషన్లు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

మంచి విద్య అందిస్తున్నారు...



నేను కూసుమంచిలోని ప్రభుత్వ కళాశాలలో చేరాను. ఇక్కడ ప్రైవేట్ కళాశాలల మాదిరి విద్యను అందిస్తున్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో నాకు మంచి మార్కులు వచ్చాయి. మాకు సకాలంలో బస్సులు లేక కళాశాలకు రావాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్యను తీర్చితే మరింతమంది కళాశాలకు రాగలుగుతాం.

– పి.భార్గవి, ఎంపీసీ, సెకండియర్, కిష్టాపురం

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



గతేడాదే ఇక్కడ కళాశాల మంజూరైనా ఫస్టియర్ ఫలితాల్లో మా విద్యార్థులు ప్రతిభ చూపారు. అనుభవం ఉన్న అధ్యాపకులచే ఇక్కడ బోధన సాగుతుంది. ఉత్తమ ఫలితాలను సాధించటమే మా లక్ష్యం. కళాశాలకు నూతన భవనాలు నిర్మిస్తున్నారు. విద్యార్థులకు మంచి వసతి కలుగుతుంది.

– బి.వీరభద్రరావు, ప్రిన్సిపాల్

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- టెండర్లు పూర్తయ్యాక నెలలో పనులు
- కేఎంసీ సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


ఐటీ హబ్ వద్ద అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్యం విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోడ్లు, డివైడర్లు, కూడళ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా కేఎంసీ అధికారుల పనితీరు ఉండాలని తెలిపారు. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి అధికారులతో సమీక్షించారు. పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు మెరుగైన వసతుల కల్పించాలన్న బాధ్యత నగరపాలక సంస్థ పై ఉందన్నారు. ప్రతిరోజూ పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తూ డివైడర్ల వెంట రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు తీయించాలన్నారు. అలాగే, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలని తెలిపారు. ప్రతీ పబ్లిక్ టాయిలెట్ వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటుచేసి ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ సేకరించాలని ఊచించారు. అంతేకాక అన్ని రోడ్లు, డివైడర్లలో మొక్కలు నాటాలని తెలిపారు. నగరంలో అందిన 40,265 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని సూచించారు.

డిసెంబర్ నాటికి పన్నుల వసూళ్లు..

కేఎంసీలో ఈ ఏడాది పన్నుల డిమాండ్ రూ.31 కోట్లకు తోడు బకాయిలు రూ.14 కోట్లు ఉన్నందున వసూళ్లపై శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. మొండి బకాయిదారులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్థిక సంవత్సరం చివరి వరకు కాకుండా డిసెంబర్ లోగా వంద శాతం వసూలుకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. కాగా, రోడ్ల విస్తరణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. వాణిజ్య సముదాయాల దగ్గర ఫుట్ పాత్ ఉండాలని తెలిపారు. ఖిలా రోప్‌వేకి భూసేకరణ పూర్తికాగా, కేబేలాకు స్థల సేకరణ చేయాలన్నారు. అలాగే, టెండర్లు పూర్తయిన పనులు నెలలోగా మొదలుపెట్టించాలని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తేకాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తొలుత పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమీక్షలో అసిస్టెంట్ కమిషనర్ జె.అనిల్‌కుమార్, ఎస్‌ఈ రంజిత్, ఈఈ కృష్ణలాల్, డీసీపీ రాజ్‌కుమార్, ఏసీపీ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్, టేబుల్ టెన్నిస్ హాల్ నిర్మాణాలను గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఈ మేరకు పనులను శనివారం పరిశీలించిన ఆయన రూ.8.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ట్రాక్ పనుల్లో వేగం పెంచాలన్నారు. అలాగే, రూ.50 లక్షలతో నిర్మించే టేబుల్ టెన్నిస్ హాల్ నిర్మాణ పనులపై కూడా సూచనలు చేశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీవైఎస్ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి మాట్లాడగా అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ.గౌస్‌తో పాటు ఉదయ్‌కుమార్, సాంబమూర్తి, సురేష్, పరిపూర్ణచారి, కొండల్ రావు, ఎస్.సంజీత్ పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలి


మాట్లాడుతున్న పుల్లయ్య

ఖమ్మం సహకారనగర్: మార్చి 2024 నుండి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కృషిభవన్‌లో పెన్షనర్ల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టంతో భవిష్యత్‌లో పెన్షనర్ల భద్రతకు పెనుప్రమాదం పొంచి ఉందని, నగదు రహిత ఆరోగ్య పథకం తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, కోటేశ్వరరావు, దుగ్గినేని శ్రీనివాసావు, భాస్కరాచారి, సత్యనారాయణ, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రఘునాథపాలెం: సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు నిత్యం గ్రామాల్లో పర్యటించాలని ఎంపీడీఓ అశోక్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ నిరోషాలు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరిగి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిరోషా, సీహెచ్‌ఓ రమాదేవి, హెచ్‌ఈఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ కూల్చివేత


కిందపడుతున్న ట్యాంక్

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్న పాత తాగునీటి సరఫరా ట్యాంక్ శిథిలంగా మారడంతో, ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా అధికారులు శనివారం ట్యాంక్‌ను కూల్చివేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో ట్యాంక్‌ను కూల్చివేశారు.

పూర్వ విద్యార్థినుల స్వర్ణోత్సవ వేడుక


గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థినులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల 1978–1979 పదో తరగతి విద్యార్థినులు నగరంలోని ఓ హోటల్‌లో స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఫిజిక్స్ ఉపాధ్యాయులు సీతారామారావు పాదపూజ చేసి సత్కరించారు. హెచ్‌ఎం శైలజ లక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు అడ్వకేట్ వనం కృష్ణవేణి, సుధారాణి, రజని, దుర్గ, ప్రసూన, సుధ, ఉమ, కృష్ణవేణి, లక్ష్మీ, ఆండాళ్, విజయ, స్వర్ణలత, గాయత్రి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని సోమవారం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పరంజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అభ్యర్థులకు ఈనెల 29న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థిని ప్రతిభ..


అభినందిస్తున్న కృష్ణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల ఇన్ఫోసిస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోగా కంపెనీ అందించిన స్ప్రింగ్ బోర్డు ఆన్‌లైన్ ప్లాట్ ఫారంలో అడ్మిషన్ పొందిన జంపాల సింధు అత్యధిక సర్టిఫికెట్లు పొంది జాతీయస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ.శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రఘునాథపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ టీయూసీఐ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ ఖమ్మం ఏరియా కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు. పది గంటల పని వేళల జీవో 282ను రద్దు చేయాలని, ప్రతీ కార్మికుడికి కనీస వేతనం రూ 26,000, కనీస పెన్షన్ రూ 9,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కొత్త పథకాలు ప్రవేశపెట్టాలని, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కార్మికుల భద్రత అప్పగించడాన్ని నిలిపివేయాలన్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, పేరబోయిన వెంకన్న, నాయకులు పసుపులేటి నరసింహారావు, భూక్య రవి, ధరావత్ మల్సూర్ సింగ్ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం


సీమంతం కార్యక్రమంలో మేయర్, గర్భిణులు, క్లబ్ సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం స్థానిక గట్టయ్య సెంటర్‌లోని రోటరీ కమ్యూనిటీ సెంటర్ లో 'తల్లి పిల్లల ఆరోగ్య సంరక్షణ' పథకంలో భాగంగా సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పి.శ్రీమహాలక్ష్మీలు మాట్లాడుతూ.. క్లబ్ పలు సామాజిక కార్యక్రమాలతో పాటు సీమంతం నిర్వహించటం అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షులు రొటేరియన్ వల్లభనేని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యురాలు బి.శ్రీదేవి, ప్రతినిధులు కాళ్ల పాపారావు, దొడ్డపనేని సాంబశివరావు, సుధాకర్, పాలడుగు నాగేశ్వరరావు, పసుమర్తి రంగారావు, రామకృష్ణ, బిక్షమయ్య, రవీంద్రనాథ్, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు


పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

నేలకొండపల్లి: పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు హెచ్చరించారు. మండలంలోని మంగాపురంతండా, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాలలో శనివారం పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌యం, ఆశా కార్యకర్తలకు, మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. వర్షాకాలం సీజన్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి..ఒక్క డెంగీ కేసు కూడ నమోదు కాకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, వైద్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని కాపాడాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రఘునాథపాలెం: కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను రాష్ట్రంలో అమలు చేయకుండా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేసి కార్పొరేట్ శక్తుల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) ఖమ్మం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మంచుకొండ గ్రామంలో జిల్లా డివిజన్ స్థాయి కమిటీ సమావేశం ధరావత్ లక్ష్మణ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం వైఖరిపై రాష్ట్రం ప్రభుత్వం మౌనంగా ఉండకుండా ప్రత్యామ్నాయ విధానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కమిటీ పలు తీర్మానాలు చేసింది. వీరబాబు, రామారావు, వెంకన్న, సత్తిరెడ్డి, సూర్యనారాయణ, సత్యం, లింగం పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల దోపిడీపై పోరాడాలి

తిరుమలాయపాలెం: కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలకేంద్రంలో సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా కట్టబెడుతూ దేశ సంపదను కొల్లగొడుతుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ ఉపాధి హామీ చట్టమును నిర్వీరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నండ్ర ప్రసాద్. శ్రీను, నరసయ్య కొమ్ము వెంకన్న, రావుల వెంకటరామిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యర్రా శ్రీనివాసరావు

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..


ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని ఓ డీలర్ గోదాంలో పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగుకు అవసరమైన ఎరువుల కొరత ఏర్పడడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై వరుస ఫిర్యాదులు వస్తుండడం, 'సాక్షి'లో గురువారం 'యూరియాకు పెరిగిన డిమాండ్' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈమేరకు వ్యవసాయ, పోలీసు శాఖల ఉద్యోగులు శనివారం పలుచోట్ల తనిఖీ చేపట్టారు. ఖమ్మం గాంధీచౌక్, ఇతర ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాలను అర్బన్ ఏఓ బి.కిషోర్ బాబు, త్రీటౌన్ సీఐ జె.మోహన్‌బాబు ఆధ్వర్యాన దుకాణాలు, గోదాముల్లో యూరియా, ఎరువుల నిల్వలను పరిశీలించడమే కాక స్టాక్ రిజిస్టర్లను పోల్చి చూసి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఏఈఓ ఎం.వెంకటేశ్వర్లు, డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు మనోహర్, మురళి పాల్గొన్నారు.

నానో ఎరువులను వాడాలి..

కామేపల్లి: నానో యూరియా, డీఏపీలను రైతులు వాడాలని ఏఓ భూక్యా తారాదేవి అన్నారు. శనివారం మండలంలోని కామేపల్లి, కొండాయిగూడెం సొసైటీ పరిధిలోని గోదాంలో ఉన్న యూరియా, ఇతర ఎరువుల నిల్వలను, స్టాక్ రికార్డులను ఎస్సై సాయికుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ.. నానో యూరియా, డీఏపీలతో వ్యవసాయోత్పత్తుల ఉత్పాదకత, నాణ్యత పెరుగుతుందని, పంటకు పర్యావరణ ఒత్తిడి, తెగుళ్లను తట్టుకునే శక్తిని అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, సీఈఓ దొడ్డ ముత్తయ్య, గాదె నాగయ్య పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కూసుమంచి: ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ వాణి, ఎస్సై నాగరాజు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం మండలంలోని జక్కేపల్లి, పెరికసింగారం సహకార సంఘాల్లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల విక్రయాన్ని పీఓఎస్ మిషన్‌తో మాత్రమే జరపాలని, విక్రయాలను నమోదు చేసి రైతులకు స్టాక్ బోర్డులు కనపడేలా ఉంచాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు వంశీకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, జల్లెపల్లి గ్రామాలలోని సొసైటీ ఎరువుల కేంద్రాలను ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి తనిఖీ చేశారు. ఎరువులు విక్రయించిన రైతుల ఆధార్, పాస్‌బుక్, ఫోన్ నంబర్ల వివరాలను పరిశీలించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


కూసుమంచిలో..



కామేపల్లిలో..


తిరుమలాయపాలెంలో..